# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 18-12-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రంలో "జల్ జీవన్ మిషన్"ను అమృత ధార పేరుతో అమలు చేస్తామని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాన్ తెలియజేశారు.

- ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రైతులు ఎరువుల వాడకం తగ్గించి పంటలు పండించాలనీ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి కోరారు.

- కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ INS నిర్దేశక్‌ను విశాఖపట్నంలోని నేవల్ డాక్ యార్డ్‌లో ఈరోజు ప్రారంభించారు.

- రాష్ట్రంలో చైనా తరహాలో విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని పురపాలక పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి.నారాయణ తెలిపారు.

- నైరుతి బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోందని విశాఖ తుఫాను హెచ్చరికల కేంద్ర తెలిపింది.

======================

రాష్ట్రంలో "జల్ జీవన్ మిషన్" ను "అమృత ధార" పేరుతో అమలు చేస్తామని ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాన్ పేర్కొపారు. "జల్ జీవన్ మిషన్"లో లోపాలు, ఇబ్బందులు సరిచేసి ప్రతీ ఇంటికీ మంచి నీటి కొళాయ్ ద్వారా తాగు నీటిని అందిస్తామన్నారు. "జల్ జీవన్ మిషన్" అమలుపై రాష్ట్ర స్థాయి కార్యశాలను ఈరోజు విజయవాడలో ఆయన ప్రారంభించారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ... ప్రతి జిల్లాలో నీటి సరఫరాకు ఉన్న ఇబ్బందులు, వనరులు తెలుసుకునేందుకు ఈ వర్క్ షాపు ఏర్పాటు చేశామని, పైపు లైన్ డిజైన్ లు కూడా గందరగోళంగా ఉన్నాయని వాటిని కూడా సరి చేస్తామన్నారు. ఇంజనీరింగ్ అధికారులు కూడా పైప్స్ ద్వారా తగు రీతిలో నీటి ధార వచ్చేలా చూడాలని ఆదేశించారు. 2025 జనవరికి పూర్తి అయిపోయే ఈ ప్రాజెక్టును పొడిగించి మన రాష్ట్రానికి 70 వేల కోట్ల రూపాయల నిధులు ఇవ్వాలని కేంద్ర జలశక్తి మంత్రి సి. ఆర్. పాటిల్ ను కోరామన్నారు.

======================

పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతు సమస్యలు తీర్చడానికి  ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందనీ రహదారులు, భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. నంద్యాల పట్టణంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం (ఆర్ఏఆర్ఎస్) భవనంలో ఈరోజు ఏర్పాటు చేసిన కిసాన్ మేళాలో మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ తో కలిసి పాల్గొన్నారు. రైతులు ఏర్పాటు చేసిన స్టాల్స్ ను పరిశీలించిన మంత్రులు అధికారులకు పలు సూచనలను చేశారు. ఈ సందర్భంగా మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ.... రైతులు ఎరువుల వాడకం తగ్గించి పంటలు పండించాలనీ, అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పంటలు పండించి మంచి దిగుబడులు సాధించాలనీ రైతులను కోరారు.

(వాయిస్ 25 సెకన్లు)

======================

కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ INS నిర్దేశక్‌ను విశాఖపట్నంలోని నేవల్ డాక్‌యార్డ్‌లో ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా సంజయ్ సేథ్ మాట్లాడుతూ... రక్షణ రంగానికి భారత నౌకాదళం చాలా కీలకమన్నారు. ఆత్మనిర్బర్ భారత్‌లో భాగంగా అత్యుత్తమ సర్వే నౌకను రూపొందించేందుకు భారత నావికాదళం సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ - ఇన్ చీఫ్, ఈస్టర్న్ నేవల్ కమాండ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో సీనియర్ సైనిక అధికారులు కూడా పాల్గొన్నారు. కాగా, GRSE కోల్‌కతాలో ఈ నౌక 80 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మితమయింది. ఆత్మనిర్భరతపై భారత నావికాదళానికి ఉన్న విశ్వాసాన్ని, నౌకానిర్మాణంలో భారతదేశం యొక్క నైపుణ్యాన్ని ఇది తెలియజేస్తోంది.

======================

నైరుతి బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోందని విశాఖపట్టణంలోని తుఫాను హెచ్చరికల కేంద్ర తెలిపింది. ఇది ప్రస్తుతం ఉత్తర దిశగా పయనిస్తోందని, దీని ప్రభావంతో మరో 48 గంటల్లో ఉత్తర, దక్షిణ కోస్తాలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తాయని, గంటకు 35నుండి 45 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని విశాఖ తుఫాను హెచ్చరికల కేంద్రం అధికారి తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

======================

అనకాపల్లి జిల్లాలో తుపాను కారణంగా భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని  సంయుక్త కలెక్టర్ ఎం. జాహ్నవి తెలిపారు. ముఖ్యంగా జిల్లాలో వరి సాగు చేసిన  రైతులు రాబోయే రెండు, మూడు రోజుల్లో వరి కోతలు వాయిదా వేసుకోవాలని తెలిపారు. ఇప్పటికే కోసిన పంటను సురక్షిత ప్రాంతాల్లో ఎత్తయిన ప్రదేశంలో ఉండేలా చూసుకోవాలని, కోసిన పంటపై టార్పాలిన్ కప్పి వర్షపు నీరు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కోతలు కోసి కళ్ళాల్లో ఉన్న ధాన్యం రక్షణకు ఇప్పటికీ 600 టార్పాలిన్లను అవసరమైన రైతులకు పంపిణీ చేశామని తెలిపారు. వర్షాలు కారణంగా దాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైన నేరుగా జిల్లా కంట్రోల్ రూమ్ నెంటర్లు 800890 1584, 94928 21030కి పిర్యాదు చేయవచ్చునని తెలిపారు.

విరామం

======================

చెత్త పేరుకు పోకుండా చైనా తరహాలో రాష్ట్రంలో విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి. నారాయణ తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఈరోజు మంత్రి పర్యటించి పలు అభివృద్ధి

పనులను ప్రారంభించారు. అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. 2027లో పుష్కరాలు జరగనున్న నేపథ్యంలో రాజమహేంద్రవరం అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో సమీక్షిస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

======================

ఉద్యోగ కల్పనే లక్ష్యంగా బీసీ స్టడీ సివిల్ సర్వీసెస్ శిక్షణా కేంద్రాలను ప్రారంభించామని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖా మంత్రి ఎస్. సవిత తెలిపారు. ఈ శిక్షణా కేంద్రాల ద్వారా నిరుద్యోగులు ప్రభుత్వోన్నత ఉద్యోగాలను పొంది రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని మంత్రి ఆకాంక్షించారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శ్యాఖ ఆధ్వర్యంలో విజయవాడలోని గొల్లపూడి లో బీసీ స్టడీ సర్కిల్ ను మంత్రి ఎస్.సవిత ఎన్టీఆర్ జిల్లా స్థానిక శాసన సభ్యులతో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ....

(వాయిస్ 25 సెకన్లు)

======================

తెలుగు రచయిత పెనుగొండ లక్ష్మీనారాయణను 2024 సంవత్సరానికి గానూ కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వరించింది. దీపిక అభ్యుదయ వ్యాస సంపుటికి గాను కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. గుంటూరులో న్యాయవాదిగా పని చేస్తున్న పెనుగొండ లక్ష్మీనారాయణ 1972 నుంచి అభ్యుదయ రచయితల సంఘం తరపున జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు బాధ్యతలు నిర్వహించారు. 1972లో “సమిధ” అనే కవితతో తన సాహిత్య ప్రయాణం ప్రారంభించిన ఆయన 2023లో జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన తొలి తెలుగు సాహితీవేత్తగా గుర్తింపు పొందారు.

======================

ఆపత్కాలంలో ఉన్నవారిని ఆదుకోవడంలో ఎన్.సి.సి చేస్తున్న సేవలు అభినందనీయమని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. తిరుపతి పశువైద్య విశ్వవిద్యాలయంలోని ఎన్.సి.సి కార్యాలయంలో విద్యార్థుల రక్తదాన శిబిరాన్ని మంత్రి ఈరోజు ప్రారంభించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఇటీవల విజయవాడలో సంభవించిన వరదల సమయంలో ప్రజలు ఇబ్బందులకు గురి అయితే ఎన్.సి.సి విద్యార్థులు ఎంతో శ్రమించి సురక్షిత ప్రాంతాలకు ప్రజలను తరలించారన్నారు.

======================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 117వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్ కు ఈనెల 27వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

======================

గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టే అభివృద్ధి పనులను త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయాలని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఎంపిడిఓ లను ఆదేశించారు. ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో పారిశుద్ధ్యం, హౌసింగ్, ఎంజిఎన్ఆర్ఈజిఎస్, తాగునీరు సంబంధిత అంశాలపై చిత్తూరు, పలమనేరు, కుప్పం, నగరి నియోజకవర్గాల వారీగా విడివిడిగా సంబంధిత అధికారులతో కలసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

======================
======================